సాక్షి
అనంతపురం
ఆదివారం। 25। మే। 2025



చీనీ టన్ను రూ.37,800
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37,800 పలికాయి.



టీచర్లకు బదిలీపోటు
టీచర్ల బదిలీ చట్టం అమలులో రోజుకో సమస్య తలెత్తుతోంది. దీంతో టీచర్లు తలలు పట్టుకుంటున్నారు.గడువు ముగుస్తుండటం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. 8లో

గరిష్టం/కనిష్టం
35.3°/24.1°
జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రెండు, మూడు రోజుల్లో నైరుతి

అనంతపురం అగ్రికల్చర్: వాతావరణం అనుకూలంగా ఉన్నందున రాగల రెండు మూడు రోజుల్లో నైరుతి రుతుపవనాలు జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకర బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఆశల 'నైరుతి' (సౌత్ వెస్ట్ మాన్‌సూన్స్) శనివారం కేరళను తాకినట్లు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అధికారికంగా వెల్లడించింది. వాతావరణం అనుకూలించడంతో 8 రోజులు ముందుగానే రుతుపవనాలు వచ్చినట్లు ప్రకటించారు. 2009లో తొలిసారిగా మే 23న 'నైరుతి' ప్రవేశించగా... 15 ఏళ్ల తర్వాత తాజాగా మేలో తాకినట్లు ఐఎండీ ప్రకటించింది.

27న అల్పపీడనం..
ఈనెల 27న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాగల మూడు రోజులు జిల్లాకు తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షసూచన ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో పాటు కొన్ని ప్రాంతాల్లో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

మద్యం దుకాణం వద్ద వ్యక్తి అనుమానాస్పద మృతి


రుద్రవైన్స్ వద్ద మృతి చెందిన వ్యక్తి

అనంతపురం: స్థానిక రామ్‌నగర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న రుద్ర వైన్స్ దుకాణం వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటనపై మద్యం దుకాణ మేనేజర్ బిల్లా నాగరాజు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మద్యం కొనుగోలు చేసి దుకాణం వెనుక భాగంలో ఉన్న బండమీద పడుకున్నాడు. ఎంతసేపటికీ లేవలేదు. గుర్తించిన కొందరు మేనేజర్‌కు సమాచారమిచ్చారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నాలుగో పట్టణ సీఐ -9346010581, ఎస్‌ఐ-9346917808 నంబర్‌కు సంప్రదించాలని పోలీసులు కోరారు.

బీసీ మహిళననే కక్షగట్టారు

- ఎమ్మెల్యేలు అమిలినేని, దగ్గుపాటి, రాజుపై కేసు నమోదు చేయాలి
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- భయభ్రాంతులకు గురిచేయడమే లక్ష్యంగా కుట్రలు :అనంత


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, చిత్రంలో అనంత వెంకట్రామిరెడ్డి, తలారి రంగయ్య, సాకే శైలజానాథ్, వెన్నపూస రవీంద్ర రెడ్డి, కోగటం విజయభాస్కర్ రెడ్డి, తదితరులు

అనంతపురం: అట్టడుగు వర్గంలో ఉన్న బోయ సామాజిక వర్గానికి చెందిన తాను జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉండటాన్ని ఓర్వలేక కక్ష కట్టి టీడీపీ ఎమ్మెల్యేలు తన ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన టీడీపీ ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, దగ్గుపాటి ప్రసాద్, ఇతర నాయకులపై కేసు నమోదు చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామి రెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్, కళ్యాణదుర్గం నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్న, మేయర్ వసీం సలీం, జెడ్పీటీసీలతో కలసి శనివారం ఏఎస్పీ డీవీ రమణమూర్తికి ఆమె ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 21న ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని, దగ్గుపాటి ప్రసాద్‌లు అనుమతి లేకుండా తన వ్యక్తిగత చాంబర్‌లోకి వెళ్లి దురుసుగా ప్రవర్తించారన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు జెడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతగా ఆయన ఫొటోను వ్యక్తిగత చాంబర్‌లో పెట్టుకున్నానన్నారు. ఈ అంశంలో జెడ్పీ అధికారులకు సంబంధం లేదన్నారు. కానీ, జెడ్పీ సీఈఓను ఎమ్మెల్యేలు దూషించడం బాధాకరమన్నారు. జిల్లాలో చాలా సమస్యలు ఉన్నాయని, వాటిపై చర్చించకుండా కావాలనే రాద్ధాంతం చేశారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అయిన తనకే భద్రత లేకుంటే ఇక సామాన్యుల పరిస్థితేంటని ఆందోళన వ్యక్తం చేశారు.

కాలమే సమాధానం చెబుతుంది..
మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య మాట్లాడుతూ ఎంపీలు, ఎమ్మెల్యేలు పదవికి తగ్గట్టు హుందాగా ప్రవర్తించాలని హితవు పలికారు.జెడ్పీ చైర్‌పర్సన్ వ్యక్తిగత కార్యాలయంలోకి వెళ్లి వాళ్లు వాడిన భాష, ప్రవర్తించిన తీరు సిగ్గుచేటన్నారు. అనంతపురం మేయర్ చాంబర్‌లోకి కూడా కొందరు టీడీపీ నాయకులు ఇలాగే వెళ్లి హల్‌చల్ చేయడం దుర్మార్గమన్నారు. కేసులు నమోదు చేసి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను కోరారు. పార్లమెంట్‌లో ఎంపీలకు కేటాయించిన గదుల్లో వారి పార్టీ నాయకుల ఫొటోలే ఉంటాయని రంగయ్య గుర్తు చేశారు. మాజీ ప్రభుత్వ అధికారిగా గతంలోనే తాను ఇలాంటి దౌర్జన్యాలను చూశానని, అప్పట్లో తమపై ఎమ్మెల్యేలు, ఎంపీలు దౌర్జన్యం చేస్తే ప్రజలంతా రోడ్లు ఎక్కారని గుర్తు చేశారు. ఎంత గొప్పవాడైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని హితవు పలికారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోకపోతే అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు లక్ష్మన్న, గోగుల పుల్లయ్య, రామచంద్ర, ఖాజా, అనిల్ కుమార్ రెడ్డి, కమల్ భూషణ్, శ్రీనివాసులు, మదన్‌మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్ర, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పక్కా పథకంతోనే..

ఎమ్మెల్యేలు తమ కాలర్స్‌కు మైక్‌లు పెట్టుకుని పక్కా ప్లాన్‌తోనే ఇదంతా చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి దుయ్యబట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లోకి దౌర్జన్యంగా వెళ్లడమే కాకుండా వ్యక్తిగతంగా ఆమెను కించపరిచిన కళ్యాణదుర్గం, మడకశిర, అనంతపురం ఎమ్మెల్యేలతో పాటు వీడియోలో ఉన్న వారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఏఎస్పీని కోరామన్నారు. అనంతపురం కార్పొరేషన్లో కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడ్డారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు జరగడం చాలా దురదృష్టకరమన్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు లేవన్నారు. స్థానిక సంస్థలనేవి స్వతంత్ర సంస్థలని, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు స్వతంత్రంగా పనిచేస్తాయని, అక్కడ ముఖ్యమంత్రి ఫొటోలే ఉండాలి... ఇతరుల ఫొటోలు ఉండకూడదన్న నిబంధన ఎక్కడా లేదన్నారు. జెడ్పీ సమావేశం జరుగుతుండగా మధ్యలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఇతర వ్యక్తులను తీసుకెళ్లి జెడ్పీ చైర్‌పర్సన్‌ను కించపరిచేలా వ్యవహరించారన్నారు. 'ఎమ్మెల్యేలు జిల్లా పరిషత్‌లో సభ్యులు కాదు. ఎంపీలు, ఎమ్మెల్యేలు గౌరవ సభ్యులు మాత్రమే. వారికి ఓటు హక్కు లేదు. ఎంపీలు, ఎమ్మెల్యేలతో గిరిజమ్మ ఎన్నిక కాలేదు. కేవలం జెడ్పీటీసీలతోనే ఎన్నికయ్యారు' అని పేర్కొన్నారు. ఇప్పటికీ వైఎస్సార్ సీపీకే జిల్లా పరిషత్‌లో సంపూర్ణ మెజార్టీ ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా స్థానిక సంస్థల్లో వైఎస్సార్ సీపీకే సంఖ్యాబలం ఉందని గుర్తు చేశారు. 'అధికారాన్ని అడ్డు పెట్టుకుని అక్కడక్కడా దించారు. కొన్ని చోట్ల దించడానికి ప్రయత్నించారు. అందులోనూ వైఫల్యం చెందారు' అని విమర్శించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌తో సహా జెడ్పీటీసీలను భయభ్రాంతులకు గురి చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు.

పెద్దాస్పత్రిపై 'పచ్చ'గద్దలు

కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతల అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. సెటిల్‌మెంట్‌లు, భూ కబ్జాలు, ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు తదితరాలతో జేబులు నింపుకుంటున్న 'పచ్చ' గద్దలు.. తాజాగా ఉమ్మడి జిల్లాలోని పేద ప్రజలకు ఆదరువుగా ఉన్న సర్వజనాస్పత్రిపైనా పడ్డారు. వీరి వసూళ్ల ధాటికి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు.

- సర్వజనాస్పత్రిలో టీడీపీ నేతల వసూళ్ల పర్వం
- స్క్రాప్ అమ్మినా తనకే కావాలని ఒక నేత పట్టు
- లోకల్ పర్చేజ్ మందుల కాంట్రాక్టు కోసం మరో నేత బెట్టు
- ఎంపీ లాడ్స్ పనులివ్వకపోతే ఖబడ్దార్ అంటూ ఒకరి దబాయింపు
- శానిటేషన్, సెక్యూరిటీ కాంట్రాక్టర్ల నుంచి ఇప్పటికే మామూళ్లు
- కూటమి నేతల ధాటికి బెంబేలెత్తుతున్న ఆస్పత్రి వైద్యులు





సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలకు పెద్ద దిక్కైన సర్వజనాసుపత్రి టీడీపీ నాయకుల దెబ్బకు విలవిలలాడుతోంది. లక్షల మందికి వైద్యసేవలు అందించే సర్వజనాసుపత్రిని 'పచ్చ'గద్దలు పీక్కు తింటున్నాయి. బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు.. ప్రమాదంలో గాయపడిన వారికి కట్టు కట్టడానికి దూది లేదు.. బాలింతలకు సరిగా మంచాలూ లేవు.. అయితేనేం తమకు నెలవారీ మామూళ్లు ఇవ్వకుండా ఇక్కడ మీరు పనిచేయలేరంటూ కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు వైద్యుల మెడపై కత్తిపెట్టారు.

పోటాపోటీగా వసూళ్లు..
టీడీపీ నాయకుల మధ్యే వసూళ్ల పోటీ తీవ్రమైనట్లు తెలిసింది. ఇటీవల ఆస్పత్రిలో స్క్రాప్ మెటీరియల్ అమ్మగా.. వచ్చిన సొమ్మంతా తనకే కావాలని స్థానిక ప్రజాప్రతినిధి మనుషులు వైద్యులను బెదిరించారు. ఇప్పటికే మందుల లోకల్ పర్చేజీ కాంట్రాక్టును పట్టుబట్టి మరీ దక్కించుకున్నారు. సెక్యూరిటీ, శానిటేషన్ కాంట్రాక్టర్ల నుంచి నెలవారీ మామూళ్లు వసూళ్లు చేస్తున్నారు. ఇటీవల రూ.40 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులు వస్తే ఆ పనుల కాంట్రాక్టులనీ తమ వాళ్లకే ఇవ్వాలని ఓ నేత హెచ్చరించారు. టీడీపీ వాళ్లే వసూళ్లకు పోటీ పడుతుండగా మధ్యలో బీజేపీ నేత ఒకరు 'నా సంగతేంటి మరి' అంటూ ఆస్పత్రి సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఆస్పత్రిలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదంటూ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

మంత్రి ఇలాకాలోనే ఇలా..
ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు కూడా పెద్దాస్పత్రే పెద్ద దిక్కు. అలాంటి ఆస్పత్రిలోనే ఇదంతా జరుగుతుంటే మంత్రి పట్టించుకోక పోవడం విస్మయం కలిగిస్తోంది. వసూళ్ల విషయాన్ని, వైద్య సేవల్లో లోపాలను ఆయన పట్టించుకోకపోతే ఆస్పత్రికి ఇక దిక్కెవరని సిబ్బంది వాపోతున్నారు. గతంలో ఎప్పుడూ ప్రజాప్రతినిధులు ఇంత దారుణంగా వసూళ్లకు ఒత్తిడి చేయలేదని, ప్రస్తుతం ఆస్పత్రిలో పనిచేయడం నిప్పుల కుంపట్లో కూర్చున్నట్లుగా ఉందని ఒక వైద్యుడు ఆవేదన వెలిబుచ్చారు.

ప్రతి దాంట్లోనూ ఇచ్చుకోవాల్సిందేనట..
ఆస్పత్రిలో జరిగే ప్రతి ఆర్థిక వ్యవహారంలో తమకు ఇచ్చుకోవాల్సిందేనంటూ 'పచ్చ' నేతలు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. మందులు, సర్జికల్ ఉపకరణాలు లోకల్ పర్చేజీ కింద సరఫరా చేస్తున్న సంస్థ 20 శాతం కమీషన్ ఇచ్చితీరాలి. ఆస్పత్రి లేదా మెడికల్ కాలేజీలో పాత సామాన్లు (కుర్చీలు, బీరువాలు, పాత బెడ్‌లు తదితరాలు) విక్రయిస్తే అందులో 50 శాతం వాటా ఇవ్వాలని, సెక్యూరిటీ, శానిటేషన్ కాంట్రాక్టర్లకు సంబంధించి నెలవారీ బిల్లులు వచ్చినా.. రాకపోయినా తమకు ఇవ్వాల్సిందేనని, రోగులకు ఏవైనా ఖరీదైన ఇంప్లాంట్స్ రాస్తే అవి సరఫరా చేసే సంస్థ నుంచి పర్సెంటేజీ ఇచ్చేలా చూడాలని, ఆస్పత్రిలో అభివృద్ధి పనులకు సంబంధించి తమ వాళ్లకు పనులొచ్చేలా సహకరించాలని లేదంటే పెండింగులో పెట్టాలని హుకుం జారీ చేసినట్లు తెలిసింది.

కిట్లు లేకుండా కరోనా టెస్టులా?

- వైద్యవిద్యా సంచాలకుడి జూమ్ మీటింగ్‌లో వైద్యుల ఆవేదన

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వ్యాధి నిర్ధారణ కిట్లు లేకుండా కరోనా పరీక్షలు చేయడం ఎలా అని వైద్యులు వాపోయినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఈ నెల 23న వైద్యవిద్యా సంచాలకులు రాష్ట్రంలోని అన్ని పెద్దాసుపత్రుల వైద్యులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. కరోనా పరిస్థితి ఎలా ఉంది.. ఎన్ని కేసులు నమోదయ్యాయి.. అంటూ ఆరా తీశారు. ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని, వ్యాధి నిర్ధారణ టెస్టులను పెంచాలని ఆదేశించారు. ఈ క్రమంలో వసతుల లేమిపై అనంతపురం మొదలు అన్ని ఆస్పత్రుల వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. 'లేబొరేటరీలో ఒక్క కరోనా కిట్ కూడా లేదు... ఒక్క పరీక్ష కూడా చేయలేకపోతున్నాం' అంటూ నిట్టూర్చారు. కరోనాతో పాటు ఇతరత్రా టెస్టులకు కూడా ఎలాంటి కిట్‌లూ లేవని, అవి వస్తేగానీ టెస్టులు చేయలేమని స్పష్టం చేశారు.

కరోనా వచ్చినా చేసేదేమీ లేదు...!
గత ప్రభుత్వ హయాంలో అత్యున్నత స్థాయిలో ప్రతి ఆస్పత్రిలోనూ మైక్రో బయాలజీ లేబొరేటరీలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గత ఏడాదిగా ఈ లేబొరేటరీలకు అవసరమైన కిట్‌లు కొనుగోలు చేయలేదు. దీంతో లేబొరేటరీల్లో ఎలాంటి పరీక్షలు సాగడం లేదని వైద్యులు అంటున్నారు. కిట్‌ల సరఫరా పూర్తిగా ఆపేశారని, ఇదే పద్ధతిలో ప్రభుత్వం వ్యవహరిస్తే కరోనా వచ్చినా చేసేదేమీ లేదని అనంతపురం సర్వజనాసుపత్రికి చెందిన ఒక వైద్యుడు వ్యాఖ్యానించారు. దీనికి తోడు బదిలీలు ఉన్నాయని చెప్పడంతో వైద్యుల్లో ఆందోళన మొదలైంది. కరోనా కేసులు నమోదవుతున్న క్రమంలో వైద్యులను బదిలీ చేస్తే పరిస్థితి ఎక్కడకు దారి తీస్తుందో అర్థం కావడం లేదని చెబుతున్నారు.

రేపు తాడిపత్రిలో 'పరిష్కార వేదిక'

అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం తాడిపత్రి పట్టణంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం పక్కన ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు.

'టిస్'లో కరెక్షన్లకు ఎంఈఓలకు అవకాశం

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం (టిస్)లో ఉపాధ్యాయులకు సంబంధించి అన్ని రకాల కరెక్షన్లకు మండల విద్యాశాఖ అధికారుల లాగిన్ అందుబాటులో ఉంచారు. ఉపాధ్యాయులు ఏవైనా మార్పులు చేయాల్సి ఉంటే సదరు మార్పునకు సంబంధించిన దరఖాస్తును స్వీకరించి క్షుణ్ణంగా దరఖాస్తును పరిశీలించి అర్హత ఉన్నట్లయితే మండల విద్యాశాఖ అధికారులు లాగిన్‌లో మార్పు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు సూచించారు.ఈ ఆప్షన్ శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఎంఈఓల లాగిన్‌లో అందుబాటులో ఉందన్నారు. ముందుగా బదిలీలకు దరఖాస్తు చేసుకున్న పాఠశాల సహాయకులకు సంబంధించిన అప్లికేషన్లను పరిశీలించి ఎలాంటి అభ్యంతరాలు లేని వాటిని సంబంధిత ప్రధానోపాధ్యాయులతో సమన్వయం చేసుకొని ఎస్ఆర్‌లను పరిశీలించి లాగిన్‌లో అప్రూవ్ చేయాలని ఆదేశించారు. మార్పు చేసిన తర్వాత ఓటీపీ కన్ఫర్మ్ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మిగతా అప్లికేషన్లను ఎడిట్ ఆప్షన్ ఎనేబుల్ చేసిన తర్వాత సబ్మిట్ చేయాలన్నారు. అలాగే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు సంబంధించిన అప్లికేషన్లను కూడా పరిశీలించి వాటిని కూడా మండల విద్యాశాఖ అధికారులు లాగిన్‌లో అప్రూవ్ చేయాలన్నారు. మండలంలో పనిచేస్తూ బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులందరికీ సమాచారం చేరవేయాలని కోరారు.



ఎడ్యుకేషన్ హబ్‌గా 'అనంత'

అనంతపురం ఎడ్యుకేషన్: కేజీ నుంచి పీజీ వరకు అన్ని కోర్సులూ అందుబాటులో ఉన్న అనంతపురం.. 'ఎడ్యుకేషన్ హబ్'గా మారింది. ఒకప్పుడు పది, ఇంటర్ తర్వాత ఉన్నత విద్య కోసం బయట ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండేది. ఇంకా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల విద్య కోసం కూడా బయట ప్రాంతాలకు పంపేవారు. ఇప్పుడా పరిస్థితి చాలావరకు తగ్గింది. విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పెద్ద ఎత్తున విద్యా సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ కూడా ఇక్కడ అందుబాటులో ఉంది. డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, డీఎడ్, ఫార్మసీ, వ్యవసాయ అనుబంధ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ యాజమాన్యాల విద్యా సంస్థలతో పాటు ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ అంతేస్థాయి కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా కేంద్రంతో పాటు చుట్టూ డిగ్రీ, ఎంబీఏ, పీజీ, ఎంసీఏ, ఫార్మసీ కళాశాలలు వెలిశాయి. చాలా కళాశాలల్లో వసతి సదుపాయం కూడా ఉండడంతో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి కూడా విద్యార్థులకు సౌలభ్యంగా మారింది. ప్రపంచస్థాయి పోటీకి అనుగుణంగా విద్యా సంస్థల్లో బోధనతో పాటు విద్యార్థుల్లో ప్రమాణాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. చాలా విద్యా సంస్థల్లో అధునాతన గ్రంథాలయాలు, సైన్స్, గణితం ప్రయోగశాలలు అందుబాటులోకి తెచ్చారు. సువిశాల భవనాలు,ప్రశాంతమైన వాతావరణంలో విద్యా సంస్థలు కొనసాగిస్తుండడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నాయి.

నేడు సివిల్స్ ప్రిలిమినరీ

అనంతపురం అర్బన్: యూపీఎస్సీ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం జరగనుంది. ఏడు కేంద్రాల్లో పరీక్ష ఉంటుంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. పరీక్షకు 2,546 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పేపర్-1 (ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు), పేపర్-2 (మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు) జరగనుంది. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు నిర్దేశించిన పరీక్ష సమయం కంటే గంట ముందే చేరుకోవాలి.

పకడ్బందీ ఏర్పాట్లు చేశాం..
సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా అబ్జర్వర్ ఎంఎం నాయక్‌కు కలెక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. జిల్లాకు శనివారం విచ్చేసిన అబ్జర్వర్‌ను ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కలెక్టర్ కలిసి మొక్క అందజేశారు.

క్లుప్తంగా

అయ్యో... అక్కమ్మ!



అక్కమ్మను చేతులపై ఎత్తుకుని ఆస్పత్రిలోకి వస్తున్న వ్యక్తి

కళ్యాణదుర్గం: ఆపత్కాలంలో తక్కున వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లే 108 వాహనం రాక ఆలస్యం కావడంతో చేసేదిలేక వృద్ధురాలిని ఓ వ్యక్తి ఆటోలో తీసుకొచ్చి ఆస్పత్రిలోనికి తన చేతిలోనే మోసుకొచ్చిన ఘటన అందరినీ కదిలించింది. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన అక్కమ్మ అనే వృద్ధురాలు శనివారం తన ఇంటి కొళాయి వద్ద బిందెలో నీరు పట్టుకుని లోనికి తీసుకొస్తుండగా పట్టు తప్పి కిందపడింది. లేవలేని స్థితిలో ఉన్న ఆమెను స్థానికులు గమనించి 108కు డయల్ చేశారు. అయితే అప్పటికే 108 వాహనం రావడానికి ఆలస్యమవుతుందని సిబ్బంది సమాచారం తెలిపారు. చేసేది లేక ఆటోలో సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి తీసుకుపోవడానికి స్ట్రెచర్/ వీల్‌చైర్ లేకపోవడంతో ఆమెను తీసుకొచ్చిన వ్యక్తి చేతుల్లోకి ఎత్తుకుని ఆస్పత్రిలోకి వెళ్లి చికిత్స చేయించారు.

మహిళ బలవన్మరణం



భాగ్యలక్ష్మి మృతదేహం

రాయదుర్గంటౌన్: భర్త మరణంతో మానసికంగా కుంగిపోయిన మహిళ శనివారం బలవన్మరణానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. రాయదుర్గం పట్టణంలోని మూడో వార్డులో నివాసం ఉంటున్న వెంకటేశులు కుమార్తె భాగ్యలక్ష్మి (32)కి స్థానికుడైన భీమరాజు అనే గార్మెంట్స్ కార్మికుడితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. పెళ్లయిన నాలుగు నెలలకే భీమరాజు మృతి చెందాడు. అనంతరం భాగ్యలక్ష్మి పుట్టింటికి చేరింది. భర్త మరణాన్ని తట్టుకోలేకపోయిన ఆమె పలుమార్లు ఆత్మహత్యకు ప్రయత్నించి విఫలమైంది. ఇదే క్రమంలో మరో మారు శనివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో 28వ వార్డులో గల పాలబావిలోకి దూకింది. స్థానికులు గమనించి బయటకు తీసేలోపు మృతి చెందింది. ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

టీచర్లకు బదిలీ పోటు

- ‘టీచర్ల బదిలీ చట్టం-2025’ అమలులో రోజుకో సమస్య
- తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు
- డీఈఓ కార్యాలయానికి ఉరుకులు పరుగులు
- జిల్లాస్థాయిలో చేతులెత్తేస్తున్న అధికారులు
- గడువు ముగుస్తుండటంతో టీచర్లలో టెన్షన్



డీఈఓతో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీల కోసం కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ‘టీచర్ల బదిలీ చట్టం-2025’ తీవ్ర నష్టం కల్గిస్తోందని సామాన్య టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా స్టేషన్ పాయింట్లు, రీఅపోర్షన్ పాయింట్లు తదితర అంశాల్లో ఆందోళన చెందుతున్నారు. తమకు ఎదురైన సమస్యలను జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తే తమ పరిధిలో లేదంటూ చేతులెత్తేస్తున్నారు. మరోవైపు దరఖాస్తు గడువు ముగుస్తున్నా తమ సమస్యలు అలాగే ఉన్నాయని వాపోతున్నారు. ఇంకోవైపు మండలాల్లో ఎంఈఓలు దరఖాస్తు అంశంపై టీచర్లపై ఒత్తిళ్లు చేస్తున్నారు. వెంటనే దరఖాస్తు చేసుకుని హార్డ్ కాపీలు తమకు అందజేయాలంటూ ఫోన్లు చేస్తున్నారు. దీంతో చాలామంది టీచర్లు సమస్యలు పరిష్కారం కాకుండానే దరఖాస్తు చేసుకున్నారు. తొలుత ఎస్జీటీగా ఉండి మరో డీఎస్సీలో ఎస్‌ఏగా ఎంపికైన వారికి ఎస్జీటీ సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదు. రెండుసార్లు రేషనలైజేషన్‌కు గురైన తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టు టీచర్లకు పాత స్టేషన్ పాయింట్లు రావడం లేదు. రేషనలైజేషన్‌కు గురయ్యేవారికి స్పెషల్ పాయింట్లు 7 రావాల్సి ఉంది. వీరికి ఆ పాయింట్లు కూడా రాలేదు. 40 ఏళ్లు పైబడిన అవివాహితుల కోసం కేటాయించిన ఐదు పాయింట్లు రావడం లేదంటున్నారు. రద్దయిన యూపీ పాఠశాలల్లో రెండేళ్ల లోపు సర్వీస్ ఉన్నవారి దరఖాస్తులు ఇంకా ఓపెన్ కాలేదు. ‘అవైలబుల్ సూన్’ అని ఆన్‌లైన్‌లో చూపిస్తోంది.

ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని నీరుగార్చిన ప్రభుత్వం

48 ఏళ్లుగా ఇన్ సర్వీస్ ఎస్సీ, ఎస్టీ టీచర్లకు కల్పిస్తున్న ఆన్ డ్యూటీ సౌకర్యాన్ని ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆయా వర్గాల టీచర్లు వాపోతున్నారు. 2023-25 బ్యాచ్‌కు సంబంధించిన ఇన్ సర్వీస్ టీచర్లకు మాత్రమే బదిలీ కోరుకునే అవకాశం కల్పించారు. 2024-26 బ్యాచ్ టీచర్లకు అవకాశం కల్పించకపోవడంతో వారంతా తీవ్రంగా నష్టపోతున్నారు. తమ స్థానాలను ఖాళీగా చూపిస్తారని, బదిలీకి అవకాశం కల్పించరనే సమాచారం ముందే ఉండి ఉంటే అసలు తాము బీఈడీ కోర్సుకు వెళ్లేవాళ్లం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ టీచర్లకు న్యాయం చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్, పుల్లన్న, నాగేంద్ర, నాగభూషణం, సూర్యనారాయణ తదితరులు డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి విన్నవించారు.

సమస్యలు పరిష్కరించాలి

బదిలీల్లో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్, పీఆర్టీయూ, పీడీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీఈఓను ప్రసాద్‌బాబును వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్. నాగిరెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీధర్‌గౌడ్, రవీంద్రారెడ్డి, పీఆర్టీయూ విష్ణువర్ధన్‌రెడ్డి, పీడీ అసోసియేషన్ నరసింహారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు.

ఎంటీఎస్ టీచర్లకు స్కేల్ లేదు

డీఎస్సీ- 1998, 2008లలో ఎంపికై ఎంటీఎస్‌గా పని చేస్తున్న ఉపాధ్యాయులకు స్పౌజ్ వర్తించదని అధికారులు స్పష్టం చేశారు. అయితే కేజీబీవీలో కాంట్రాక్ట్ కింద పని చేస్తున్న టీచర్లకు మాత్రం స్పౌజ్ పెట్టారు. డీఎస్సీ ద్వారా ఎంపికైన ఎంటీఎస్ టీచర్లకు స్పౌజ్ వర్తించకపోవడం అన్యాయమని వాపోతున్నారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులు చాలామంది రిటైర్డ్ అవుతున్నారు. కనీసం సర్వీస్‌లో ఉన్నవారికైనా స్పౌజ్ వర్తించేలా చూడాలని కోరుతున్నారు.

నిరుద్యోగ యువతకు శుభవార్త

- 80 శాతం రాయితీతో కంప్యూటర్ కోర్సులు
- శిక్షణ అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: నిరుద్యోగ యువతకు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ శుభవార్త చెప్పింది. 80 శాతం ఫీజు రాయితీతో కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఐటీ రంగంలో 18 సంవత్సరాలు అనుభవం కలిగిన శిక్షకులతో అత్యున్నత నాణ్యమైన శిక్షణ ఇస్తామన్నారు. జావా ఫుల్‌స్టాక్, పైథాన్, డేటా ఇంజినీరింగ్ కోర్సుల్లో ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. మార్కెట్‌లో ఉన్న ఫీజులతో పోల్చుకుంటే ఇక్కడ 80 శాతం రాయితీ (కేవలం రూ.5 వేలు మాత్రమే) చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇంజినీరింగ్ పాస్, ఎంసీఏ పాస్, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ కోర్సులు 2022-25 మధ్య కాలంలో చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు అనంతపురం శివారులోని ఉప్పరపల్లి వద్దనున్న ఎకాలజీ సెంటర్ లేదా 73969 50345, 83175 94591 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సెల్‌ఫోన్ కోసం ప్రాణం తీసుకున్నాడు

- రైలుకింద పడి విద్యార్థి ఆత్మహత్య



శ్రీనివాసులు (ఫైల్)

సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. సెల్‌ఫోన్ లేకుంటే సమాచార వ్యవస్థ.. జీవన గమనం ఆగిపోయినట్లుగా కొందరు భావిస్తున్నారు. కుమారుడు ఇతరుల సెల్‌ఫోన్ వాడుతుండడం చూసి ఇది మంచి పద్ధతి కాదని తండ్రి లాగేసుకున్నాడు. అంతే.. ఆ సెల్‌ఫోన్‌లో ఏముందో తెలియదు కానీ భరించలేకపోయాడు. రైలు కిందపడి ప్రాణం తీసుకున్నాడు. ఈ ఘటన అందరినీ కలచివేసింది.

గుంతకల్లు: సెల్‌ఫోన్ కోసం ఓ విద్యార్థి ప్రాణం తీసుకున్నాడు. అర్ధంతరంగా తనువు చాలించి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చాడు. విద్యార్థి బంధువులు, జీఆర్‌పీ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పాత గుంతకల్లులోని ఆర్టీటీ బిల్డింగ్‌ల్లో నివాసముంటున్న బేల్దారి వడ్డే నాగభూషణం, జయలక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. అందులో రెండవ సంతానం శ్రీనివాసులు (16). ఇటీవల పదో తరగతి పాసైన శ్రీనివాసులును తండ్రి శ్రీ శంకరనంద గిరి జూనియర్ కళాశాలలో చేర్పాడు. స్నేహితుడు ఇచ్చిన సెల్‌ఫోన్‌ను రిపేరీ చేయించుకుని శ్రీనివాసులు వాడుకునేవాడు. ఇతరులది మనకెందుకు.. కొత్తది కొనిస్తాను అని చెప్పి సిమ్ తీసేసి, సెల్‌ఫోన్‌ను తండ్రి లాక్కున్నాడు. సెల్‌ఫోన్ కోసం తండ్రిని బతిమాలేవాడు. అయినా ఇవ్వకపోవడంతో మనస్తాపం చెందాడు. శనివారం ఉదయం బయటకు వెళ్లిన నాగభూషణం బేల్దారి పని లేకపోవడంతో కాసేపటి తర్వాత ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటికి శ్రీనివాసులు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులను ఆరా తీశాడు. ఇంతలోనే సెల్‌ఫోన్ రింగ్ అయ్యింది. ‘మీ కొడుకు హనుమాన్ సర్కిల్ రైల్వేస్టేషన్ వద్ద రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు’ అని సమాచారం అందడంతో తండ్రి కుప్పకూలిపోయాడు. తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకోగా.. తల, మొండెం వేరు అయిన కుమారుడిని చూసి చలించిపోయారు. ‘ఇందుకా నిన్ను అల్లారు ముద్దుగా పెంచుకున్నాం. మాకు ఇంత పెద్ద శిక్ష వేశావ్ కదా నాన్న’ అంటూ తల్లిదండ్రులు బిగ్గరగా రోదించారు. జీఆర్‌పీ ఎస్‌ఐ మహేంద్ర ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చేశారు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

- అమరావతి ఒక్కటే ప్రాధాన్యం కాదు
- హామీల అమలు, అభివృద్ధి పనులకు నిధులు వద్దా?
- జెడ్పీ చైర్‌పర్సన్, మేయర్‌పై కూటమి నేతల తీరు సిగ్గుచేటు
- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజం

ఉరవకొండ: రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా పక్కన పెట్టి అమరావతి జపం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీని అప్పుల కుప్పగా మార్చేస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి తానేదో చరిత్రలో నిలిచిపోతానన్న భ్రమతో ఒక్క అమరావతి నిర్మాణానికే రూ.3 లక్షల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవుతున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో అమరావతి కోసం రూ.6 వేల కోట్లను కేటాయించారన్నారు. అమరావతి నిర్మాణం కోసం 53 వేల ఎకరాల భూమిని సేకరించగా, అదనంగా మరో 43వేల ఎకరాలు కుడా తీసుకొనేందుకు సిద్ధం అయ్యారన్నారు. దీనికితోడు 16వ ఆర్థిక సంఘాన్ని సీఎం కలిసి అమరావతి కోసం రూ.80 వేల కోట్ల రుణం కావాలని కోరారని తెలిపారు. రాజధాని కోసం ఇబ్బడిముబ్బడిగా ఖర్చు చేస్తున్న ముఖ్యమంత్రికి ‘సూపర్ సిక్స్’ హామీల అమలు, అభివృద్ధి పనులకు ఎక్కడ నుంచి నిధులు తెస్తారో ప్రజలకు తెలపాలన్నారు.

జిల్లాలో పక్కాగా రెడ్‌బుక్ పాలన

జిల్లాలో కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు మంత్రి నారా లోకేష్ రెడ్‌బుక్ పాలనను పక్కాగా అమలు చేస్తున్నారని విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తన వ్యక్తిగత చాంబర్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్ ఫొటో పెట్టుకోవడమే పాపంగా చూపుతూ టీడీపీ ఎమ్మెల్యేలు దురుసుగా ప్రవర్తించడాన్ని తప్పుపట్టారు. అనంతపురం నగర మేయర్ వసీంపై కుడా కూటమి నేతలు ఇదే విధంగా వ్యవహరించారని మండిపడ్డారు. అలాగే రాష్ట్రంలో మాజీ ఐఏఎస్, ఐపీఎస్‌లను విచారణ పేరిట అక్రమంగా అరెస్టు చేయడం.. తప్పుడు సాక్ష్యాలు, తప్పుడు వాంగ్మూలాల నమోదు కోసం ఇబ్బంది పెట్టడం చేస్తున్నారన్నారు.

పయ్యావుల సోదరుల చేతికి మట్టి అంటకుండా...

ఉరవకొండ నియోజకవర్గంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆయన సోదరుడు పయ్యావుల శ్రీనివాసులు తమ చేతికి మట్టి అంటకుండా పోలీసుల చేత పాలన సాగిస్తున్నారని విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేస్తూ తప్పుడు కేసులు బనాయించి స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారని తెలిపారు. టీడీపీలో చేరితే కేసులు మాఫీ చేస్తామంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఇందులో ఉరవకొండ రూరల్ సీఐ చిన్నగౌస్, కూడేరు సీఐ రాజు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ముఖ్యమైన నాయకులను టార్గెట్ చేస్తూ పోలీసుల చేత బెదింపులకు దిగుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో పయ్యావుల సోదరులు ఇసుక, మద్యం, పేకాట లాంటివాటిని పెద్ద ఎత్తున ప్రోత్రహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ ఈడిగప్రసాద్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందునాయక్, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, మాజీ జెడ్పీటీసీ తిప్పయ్య, ఎర్రిస్వామిరెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బసవరాజు, జగదీష్, డిష్ సురేష్ పాల్గొన్నారు.

అక్రమ కేసులో ఇరికించాలనే కుట్ర

- వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు రేవన్న గౌడ్



కళ్యాణదుర్గం: తనను, తన కుమారుడిని ఆర్థికంగా దెబ్బతీసేందుకు కొందరు అక్రమ కేసుల్లో ఇరికించేందుకు కుట్ర పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు రేవన్న గౌడ్ ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను, తన కుమారుడు రాజస్తాన్ వ్యాపారులను కొట్టినట్లు కొందరు ఆరోపిస్తున్నారని వాపోయారు. ఎన్నో ఏళ్లుగా ఐరన్ వ్యాపారం చేసుకుంటున్నానని, ఏనాడూ తోటి వ్యాపారస్తులతో కానీ, రాజస్తానీయులతో కానీ ఎలాంటి తగదా లేదన్నారు. అయితే కొందరు డబ్బు కోసం స్వార్థంగా దిగజారి తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. రాజస్తానీయులు తమకు అనుకూలంగా ఉన్న వారికి తక్కువ ధరకు, అనుకూలంగా లేని వారికి అధిక ధరలకు ఐరన్ విక్రయించడంతో స్థానికంగా ఉన్న ఐరన్‌వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ధరల విషయంపై మాట్లాడేందుకు స్థానిక వ్యాపారులతో కలిసి వెళ్తే దాడులు చేసినట్లు ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. స్థానికులు వ్యాపారాలు చేస్తే సహకరించాల్సింది పోయి ఇతర రాష్ట్రాల వారికి వత్తాసు పలుకుతూ తమపైనే స్థానికంగా ఉన్న కొందరు దాడులు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు.


డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీకి గ్రీన్‌సిగ్నల్

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో బిందు, తుంపర (డ్రిప్, స్ప్రింక్లర్లు) పరికరాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం, హార్టికల్చర్ డైరెక్టరేట్ నుంచి అనుమతులు జారీ చేసినట్లు ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన రైతులు ఆర్‌ఎస్‌కేల్లో కోరుకున్న కంపెనీ ఎంపిక చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతు ఆధార్, భూమి పాస్‌పుస్తకం, 1-బీ, బ్యాంకు అకౌంట్ జిరాక్సులతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటో అందించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది 10 ఎకరాల్లోపున్న ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీతో పరికరాలు అందించనుండగా, ఇతర రైతులకు 90 శాతం రాయితీ వర్తింపజేశారన్నారు. అలాగే 50 శాతం రాయితీపై స్ప్రింక్లర్ సెట్లు పంపిణీ చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు సంబంధించి సీనియార్టీ వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాత మంజూరు ఉత్తర్వులు ఉంటాయన్నారు. రైతులు తమ వాటాను డిజిటల్ విధానంలోనే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పరికరాలు సరఫరా చేసేందుకు 29 డ్రిప్ కంపెనీలకు అనుమతులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాకు 18 వేల హెక్టార్లు టార్గెట్ ఇచ్చారన్నారు. దళారులను నమ్మకుండా ఏపీఎంఐపీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

‘చట్ట ప్రకారమే ముందుకెళ్లాం’

అనంతపురం మెడికల్: కదిరికి చెందిన తోట శిరీష, పాముల లక్ష్మినారాయణ కుటుంబ సమస్యలకు సంబంధించి ఇరు వర్గాల ఫిర్యాదులో భాగంగా చట్టప్రకారమే తాము ముందుకెళ్లామని కదిరి అర్బన్ సీఐ నారాయణ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మనస్పర్థల కారణంగా భార్యాభర్త పరస్పరం ఫిర్యాదు చేయడంతో ఇరువైపులా నాలుగు కేసులు నమోదు చేశామని తెలిపారు. శిరీషను బెదిరించారన్న ఆరోపణలతో భర్త లక్ష్మినారాయణ, కూతురు యషిక, శివ (యషిక భర్త), జగదీష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని, ఈ కేసుకు సంబంధించి స్టేషన్‌కు రమ్మని చెప్పాము తప్పా ఎవరినీ దుర్భాషలాడలేదని పేర్కొన్నారు.

బాలుడి మరణం బాధాకరం



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పీసీఈ

గుంతకల్లు: రైల్వే స్టేషన్‌లో గోడ పెచ్చులూడి మణికంఠ (8) అనే బాలుడు మృతి చెందడం బాధాకరమని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ (ఎస్‌సీఆర్‌పీసీఈ) బ్రహ్మానందం అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శనివారం ఆయన గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తాతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 6, 7వ నంబర్ ప్లాట్‌ఫాంలలోని జనరల్ వెయింటింగ్ హాల్‌లో ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఇక్కడి భవనాలను, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, వెయింటింగ్ హాల్స్‌ను తనిఖీ చేశారు. భవనాల్లోని పైకప్పులు, గోడ తదితర వాటిని క్షుణంగా పరిశీలించి, అక్కడ చేపట్టాల్సిన భద్రతా చర్యలను అధికారులకు తెలియజేశారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. శిథిలావస్థకు చేరిన భవనాలు, వంతెనల గురించి ఆరాతీశారు. అవసరమైతే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఫోర్ మెన్ కమిటీ ఏర్పాటు : మణికంఠ మృతి ఘటనపై ఫోర్ మెన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించి మణికంఠ తల్లిదండ్రులను కూడా ఫోర్ మెన్ కమిటీ విచారణ చేస్తుంది.

మునగ సాగును ప్రోత్సహించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: మునగ లాభదాయకమైన పంట అని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మునగ సాగుపై కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో జిల్లా అధికారులు, డీఆర్‌డీఏ- వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అద్భుతమైన పోషక విలువలు కలిగిన, రైతులకు లాభదాయకమైన పంటగా మునగ ముందువరుసలో ఉంటుందన్నారు. మునగను ఔషధ తయారీలో చూర్ణంగా, నూనెగానూ ఉపయోగిస్తారన్నారు. జిల్లాలో మునగ సాగును పెద్దఎత్తున చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. బ్రహ్మసముద్రం, రాయదుర్గం మండలాల్లో 100 ఎకరాల చొప్పున మునగ సాగు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. నిర్దేశించిన మేర పంట సాగు చేస్తే ఆయా మండలాల్లో ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవకాశం ఉంటుందన్నారు. ఎకరాకు 6 వేల నుంచి 8 వేల చెట్లతో పంట పండించవచ్చన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ పంట సాగువైపు వారిని పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పంట సాగు అనంతరం మార్కెటింగ్ కల్పించేందుకూ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ కింద ఏడాదికి 200 ఎకరాల్లో మునగ సాగుకు లక్ష్యం కేటాయించామన్నారు. ఎఫ్‌పీఓలను గుర్తించి షేడ్‌నెట్స్, కలెక్షన్ సెంటర్లు ఇవ్వాలన్నారు. మునగ సాగుపై క్షేత్రస్థాయిలో అధికారులు ప్రతి బుధవారం మండల అధికారులతో సమావేశం నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శైలజ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, పశు సంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, ఉద్యాన శాఖ డీడీ రఘునాథరెడ్డి, ఏడీ ఫిరోజ్ ఖాన్, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, డీపీఓం గంగాధర్, ఏపీడీలు, ఎఫ్‌పీఓలు పాల్గొన్నారు.

చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలి

జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. చెత్తసేకరణలో వెనకబడిన పంచాయతీలపై కలెక్టర్ శనివారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఆయా కార్యదర్శులతో సమీక్షించారు. ప్రతి హ్యాబిటేషన్‌లోనూ ఇంటింటి చెత్త సేకరణ వందశాతం జరగాలన్నారు. చెత్తసేకరణపై ప్రభుత్వం ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటోందన్నారు. అందులో కందుకూరులో ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని ఫిర్యాదు వచ్చిందన్నారు. చెత్తసేకరణకు క్లాప్‌మిత్రలను నియమించుకోవాలన్నారు. ఇక విడపనకల్లు మండలం గడేకల్లులో వారానికి రెండుసార్లు చెత్త సేకరణ చేపడుతున్నట్లు ప్రజల నుంచి సమాచారం వచ్చిందన్నారు. రోజూ చెత్తసేకరణ చేయాల్సిందేనని ఆదేశించారు. ఇందుకు 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు వచ్చే నిధులను ఖర్చు చేయాలని చెప్పారు. వచ్చే నెల మరో మారు ప్రభుత్వం సర్వే చేస్తుందన్నారు. ఈ సర్వేలో చెత్తసేకరణలో వెనకబడిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, డీపీఆర్‌సీ అధికారి మాధవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతిభా పురస్కారాలు అభినందనీయం



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: విద్యార్థులను ప్రోత్సహించేలా ఉత్తమ ప్రతిభా పురస్కారాల కార్యక్రమం అభినందనీయమని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. పదవ తరగతిలో 550.. ఆపై మార్కులు సాధించిన విద్యార్థులకు ఏపీఎస్ఎఫ్, ఇన్‌స్పైర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అందించనున్న ఉత్తమ ప్రతిభా పురస్కార కార్యక్రమ పోస్టర్లను కలెక్టర్ శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎఫ్ అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకుడు గురుసాయి, పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పైర్ సంస్థ కో– కన్వీనర్లు చంద్రశేఖర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

మిగులు టీచర్లకు అన్యాయం



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న స్కూల్ అసిస్టెంట్ల అసోసియేషన్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రస్తుత బదిలీల్లో స్కూల్ అసిస్టెంట్లను పీఎస్‌హెచ్‌ఎంల బదిలీల తర్వాత కౌన్సెలింగ్‌కు పిలవడం చాలా అన్యాయమని స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ నాయకులు వాపోయారు. ఈ మేరకు శనివారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయా సబ్జెక్టుల వారీగా పీఎస్‌హెచ్‌ఎం ఖాళీలను చూపిస్తూ వారే కోరుకునేలా చూడాలని కోరారు. లేనిపక్షంలో పీఎస్‌హెచ్‌ఎంగా విల్లింగ్ ఉన్న ఎస్‌ఏల నుంచి అనుమతి తీసుకుని పీఎస్‌హెచ్‌ఎంల జాబితాలో కలిపి కౌన్సెలింగ్ నిర్వహించేలా చూడాలన్నారు. డీఈఓను కలిసిన వారిలో స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.శివశంకర్, ప్రధానకార్యదర్శి జి.లింగమూర్తి, రాష్ట్ర నాయకులు బి.శివశంకరయ్య, బి.రాజశేఖర్, జి.నాగన్న, పి. రంగారెడ్డి ఉన్నారు.

చిన్నారులకు వార్డుల్లోనే 2డీ ఎకో



రెండు నెలల చిన్నారికి గుండె పరీక్ష చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌దీన్ కుమార్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చిన్నపిల్లల వార్డులో పసికందులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అత్యాధునిక పరికరాలు సమకూర్చారు. చిన్నపిల్లల వార్డుకు ప్రత్యేకంగా మంజూరైన ఈ రెండు 2డీ ఎకో మిషన్లు తాజాగా అందుబాటులోకి వచ్చాయి. పీఐసీయూ, ఎస్‌ఎన్‌సీయూలో మిషన్లను అందుబాటులో ఉంచారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి చిన్నారులకు స్కాన్‌లు చేస్తున్నారు. దీంతో చిన్నారులకు మెరుగైన వైద్యం అందించడానికి వీలుగా ఉంటుందని చిన్న పిల్లల విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. వీటి ధర ఒక్కొక్కటి రూ.15 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు ఉండవచ్చన్నారు.

విద్యుత్ పరికరాల చోరీ

కనగానపల్లి: వ్యవసాయ పొలంలోని విద్యుత్ పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధిత రైతు శ్రీనాథ్ తెలిపిన వివరాల మేరకు...కనగానపల్లిలో ప్రధాన రహదారి పక్కన ఉన్న తన వ్యవసాయ పొలంలో శ్రీనాథ్ ఇటీవలే కొత్తగా బోరువేసి మోటరు అమర్చుకున్నాడు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మోటరుకు అమర్చిన స్టార్టర్ పెట్టె, కేబుల్ ఎత్తుకెళ్లారు. చోరీ అయిన సామగ్రి విలువ రూ.30 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ప్లాస్టిక్ వ్యర్థాలు నిర్మూలించాలి



మాట్లాడుతున్న ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల్లోని వారు ఎక్కువగా ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగిస్తూ రోగాల బారిన పడుతున్నారని, అందువల్ల ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించాలని ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్లాస్టిక్ వ్యర్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ (ఒకసారి వాడి పడేసినవి) ప్లాస్టిక్‌ను ఎట్టిపరిస్థితుల్లో వాడరాదన్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులు, గుడ్డ సంచులు వాడాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటామని, అందులో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ తమవంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

గాలి కొట్టాల్సిందే.. నీరు ఇవ్వాల్సిందే

- పెట్రోల్ బంకుల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి
- మరుగుదొడ్లు, తాగు నీటి వసతి తప్పనిసరి
- ఉచితంగా వాహనానికి గాలి నింపాలి



రాప్తాడులోని భారత్ పెట్రోల్ బంకు

ప్రయోజనం

రాప్తాడు: సాధారణంగా మనం పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనానికి పెట్రోలు కొట్టించుకుని వెళ్లిపోతూ ఉంటాం. అక్కడ కేవలం పెట్రోలు మాత్రమే దొరుకుతుందని భావిస్తాం. అయితే అక్కడ మరిన్ని సేవలు పొందే అవకాశమూ ఉంది. అవి కూడా ఉచితంగా. ఎందుకంటే మనం ప్రతి లీటర్ డీజిల్/పెట్రోల్‌పై వ్యాట్ రూపంలో పన్ను చెల్లిస్తున్నందున బంక్ యజమానులు సౌకర్యాలన్నీ కల్పించాల్సి ఉంటుంది. కానీ జిల్లాలోని చాలా పెట్రోలు బంకుల్లో సేవలు కానరావడం లేదు. కొన్నిచోట్ల టాయిలెట్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. మరి కొన్ని చోట్ల గాలి యంత్రాలు పని చేయడం లేదు.

స్వచ్ఛమైన తాగునీరు

జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన పెట్రోలు బంకులు దాదాపుగా 100 పైగానే ఉన్నాయి. వీటి వద్ద స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచాలి. అక్కడ ఆర్వో యంత్రం, వాటర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలి. ఏ పెట్రోలు బంకులోనైనా తాగునీరు అందుబాటులో లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు.

మరుగుదొడ్లు..

'స్వచ్ఛ భారత్'లో భాగంగా అన్ని పెట్రోలు బంకుల్లో వాహన చోదకులు, ప్రజలకు మూత్రశాలలు, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని ఏర్పాటు చేసినా... వినియోగదారులను అనుమతించడం లేదనే విమర్శలున్నాయి. మరిన్ని చోట్ల అసలు మరుగుదొడ్డే కనిపించని పరిస్థితి. బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చు. లీటర్ పెట్రోలు/డీజిల్ కొనుగోలుకు మనం చెల్లించిన సొమ్ములో నాలుగు నుంచి ఎనిమిది పైసలు వరకూ మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు ఉపయోగించాల్సి ఉంటుంది.

ఫోన్ సదుపాయం

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ వినియోగించుకునే సదుపాయం కూడా పెట్రోలు బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యల్లో చిక్కుకుంటే, మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పని లేదు. ఏదైనా పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి మీరు ఏ నంబర్‌కైనా కాల్ చేసుకోవచ్చు.

నాణ్యతా ప్రమాణాలు

పెట్రోల్/ డీజిల్ నాణ్యతా ప్రమాణాలను తెలుసుకునే హక్కు వినియోగదారులందరికీ ఉంటుంది. దీనికి సంబంధించిన సదుపాయాన్ని బంక్ యజమాన్యాలు కల్పించాలి. పెట్రోల్/ డీజిల్ తక్కువగా వచ్చిందని అనుమానం వస్తే వినియోగదారులు అక్కడికక్కడే పరీక్షించుకోవచ్చు. అందుకోసం క్వాలిటీ చెక్ టిష్యూ పేపర్‌ను అందుబాటులో ఉంచాలి. నోటీసు బోర్డులో సంబంధిత ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ నంబర్‌ను తప్పకుండా ప్రదర్శించాలి.

ప్రథమ చికిత్స కిట్

ప్రతి పెట్రోలు బంకులో ఫిర్యాదు బాక్స్, రిజిస్టర్ అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారుల తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంక్ వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది. ఆ ప్రథమ చికిత్స పెట్టెలో మందులు తప్పకుండా ఉండాలి.

గాలి ఉచితంగా పట్టాల్సిందే

వాహనాల టైర్లలో గాలి నింపడానికి, గాలి ఎంత ఉందో తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు ఒక వ్యక్తిని నియమించాలి. బంకుల్లో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనాదారులు కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల వాహనాల టైర్లలో సాధారణ గాలికి ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు



నిబంధనలకు అనుగుణంగా పెట్రోలు బంక్‌లను నిర్వహించాలి. కచ్చితంగా మరుగుదొడ్లు ఉండాలి. తాగునీటి సదుపాయం కల్పించాలి. వాహనాలకు ఉచితంగా గాలి నింపాలి. పౌరసరఫరా, రెవెన్యూ, పోలీసు అధికారులు నిత్యం బంకుల్లో తనిఖీలు నిర్వహిస్తారు. ప్రత్యేకించి ఫిర్యాదులు వస్తే సత్వరం స్పందించి చర్యలు తీసుకుంటాం.

–విజయకుమారి, తహసీల్దార్, రాప్తాడు

అధైర్య పడొద్దు... అండగా ఉంటాం



ప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- ప్రతాప్‌రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: ''అధైర్య పడొద్దు...నీకు ఏ కష్టం వచ్చినా మా కుటుంబం అన్ని విధాలా అండగా ఉంటుంది'' అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రతాప్‌రెడ్డికి ధైర్యం చెప్పారు. ఈ నెల 17న టీడీపీ మూకల దాడిలో చిగిచెర్ల నారాయణరెడ్డి, చిగిచెర్ల ముత్యాలమ్మ దంపతులు మృతి చెందిన విషయం తెలిసిందే. అదే దాడిలో తీవ్రంగా గాయపడిన నారాయణ రెడ్డి బావమరిది ప్రతాప్‌రెడ్డి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా...శనివారం తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. దాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ''మీ అక్కా, బావా ఇద్దరూ ఒకే ఘటనలో మృతి చెందడం బాధాకరం. మీ బాధను తీర్చడం ఎవరి తరం కాదు... కానీ మీకు మీకు ఏ సమస్య వచ్చినా తాను, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది'' అని ధైర్యం చెప్పారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను వాకబు చేశారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. నారాయణ రెడ్డి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా నిలవాలని స్థానిక నాయకులకు సూచించారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వెంట రాప్తాడు వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ యూత్ విభాగం శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్ రెడ్డి, బిల్లే అభిలాష్ తదితరులు ఉన్నారు.

అక్కపై దాడి చేసిన తమ్ముడిపై కేసు

యాడికి: అమ్మ కమ్మలు ఇవ్వాలని అడిగిన అక్కపై తమ్ముడు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని పుప్పాల గ్రామానికి చెందిన యర్రమ్మకు కూతురు రమాదేవి, కుమారుడు నాగేంద్ర ఉన్నారు. వీరికి వివాహాలు కావడంతో గ్రామంలోనే నివసిస్తున్నారు. 20 రోజుల క్రితం యర్రమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. గతంలో కమ్మలు ఇస్తానని యర్రమ్మ తన కూతురు రమాదేవికి హామీ ఇచ్చింది. ఇటీవల తల్లి యర్రమ్మ మృతి చెందడంతో కమ్మలు ఇవ్వాలని తమ్ముడు నాగేంద్రను రమాదేవి కోరింది. కోపంతో ఊగిపోయిన నాగేంద్ర రమాదేవిపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె కంటికి గాయాలయ్యాయి. రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీనుల విందుగా సంగీత విభావరి



సంగీత విద్వాంసున్ని సత్కరిస్తున్న జ్వాలాపురం శ్రీకాంత్ తదితరులు

అనంతపురం కల్చరల్: త్యాగరాజ సంగీత సభలో శనివారం రాత్రి సాగిన శాస్త్రీయ సంగీత విభావరి ఆహూతులను కట్టిపడేసింది. సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ డాక్టర్ కె.వాగీష్ కృష్ణ నేతృత్వంలో సంగీత విభావరి నిర్వహించారు. వాగ్గేయకారులను తలపిస్తూ సాగిన సంగీత విభావరి వీనులవిందు చేసింది. ముఖ్యంగా జయమోహిని త్యాగరాజు కృతి, ఓ రామ నీ నామం ఎంతో రుచి రా వంటి భద్రాచల రామదాసు కృతులు ఆనందంలో ఓలలాడించాయి. ప్రముఖ కళాకారులు వయొలిన్‌పై పుష్ప జ్ఞానదేవ్, మృదంగంపై పెరవలి జయభాస్కర్ వాయిద్య సహకారంతో శ్రోతల మది దోచుకున్నారు. అంతకు ముందు జరిగిన సమావేశానికి త్యాగరాజ సంగీత సభ అధ్యక్షులు ఎన్సీ సంపత్‌కుమార్, సంగీత సభ వ్యవస్థాపకులు సీఎస్ జ్ఞానేశ్వరరావు, మాజీ ప్రభుత్వ సలహాదారు (ఎండోమెంటు) జ్వాలాపురం శ్రీకాంత్, ఆచార్య సుధాకరబాబు తదితరులు మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి కళాకారులు అనంతకు విచ్చేయడం ఆనందదాయకమన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో సాగే సంగీత ధ్వనులు ఆనందాన్ని ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. సంగీత సభ శాస్త్రీయ సంగీతం, నాట్యం వంటి కళా ప్రదర్శనలను ప్రోత్సహిస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం సంగీత విభావరి నిర్వహించిన కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సంగీత విద్వాంసులు వీరాస్వామి, లతాశ్యామ్, సీనియర్ న్యాయవాది హరికృష్ణ, రోహిణి, మొదలి మురళీకృష్ణ, ప్రభావతి, పాలసముద్రం నాగరాజు, శ్రీదేవి, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా సాధన చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు



ధ్యానం చేస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, ప్రొఫెసర్లు, సిబ్బంది

అనంతపురం మెడికల్: నిత్యం పని ఒత్తిడి, బిజీ జీవితంతో ఉన్న ప్రతి ఒక్కరికీ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు అన్నారు. శనివారం ప్రభుత్వ వైద్య కళాశాలలో రేడియాలజీ పీజీ విద్యార్థిని, యోగా మాస్టర్ ట్రైనర్ డాక్టర్ రిచారెడ్డి యోగా తరగతులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రోజూ గంట పాటు యోగా సాధన చేయాలన్నారు. మానసిక దృఢత్వంతో పాటు ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రేడియాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ సురేష్, అనాటమీ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.ఉమామహేశ్వర రావు, వైద్యులు డాక్టర్ పద్మ శ్రావణి, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ నీరజ, డాక్టర్ కనపర్తి స్వాతి, డాక్టర్ జగదీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో..

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో 'యోగాంధ్ర'లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత పాల్గొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ జి.వెంకటనాయుడు, ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, రిజిస్ట్రార్ రమేష్ బాబు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, స్పోర్ట్స్ సెక్రెటరీ జెస్సీ తదితరులు పాల్గొన్నారు.

దగ్గుపాటివి బ్లాక్ మెయిల్ రాజకీయాలు

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్



మాట్లాడుతున్న సాకే చంద్రశేఖర్

అనంతపురం కార్పొరేషన్: 'కంపోస్టు యార్డులో జరిగిన బయోమైనింగ్‌లో రూ.కోట్లలో అవినీతి జరిగిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చెబుతున్నారు. వారి ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలవుతోంది. నిజంగా అవినీతి జరిగింటే నిరూపించాలి. తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే ఎమ్మెల్యేబ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారు' అని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్పొరేటర్లతో కలసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ రూ.23 కోట్లతో బయోమైనింగ్ పనులు మొదలు పెడితే అందులో రూ.9.58 కోట్లు మాత్రమే నిధులు సదరు కంపెనీకి చెల్లించారన్నారు. ఆ నిధుల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.5.36 కోట్లు, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4.22 కోట్లు అందించారన్నారు. కౌన్సిల్ సమావేశం జరిగినప్పుడల్లా సదరు కంపెనీకి బిల్లులు చెల్లించాలని చెప్పేది ఎమ్మెల్యేనే అని, మళ్లీ బయటకు వచ్చి అవినీతి జరిగిందని మాట్లాడేది ఆయనే అని.. నిజంగా ఆయన మాట్లాడే మాటలకు పొంతన ఎక్కడుందని ప్రశ్నించారు. బయోమైనింగ్‌పై విచారణ చేయించాలని సాక్షాత్తు కలెక్టర్ వినోద్ కుమార్‌కు మేయర్ వసీం ఫిర్యాదు చేశారని, విచారణకు కౌన్సిల్ సభ్యులంతా సిద్ధంగా ఉన్నామన్నారు. బిల్లులు చేసిన అధికారులను విచారణ చేయాలని డిమాండ్ చేశారు. నగరాభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ముందా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అయినప్పటి నుంచి నగరపాలక సంస్థకు ఒక్క రూపాయి నిధులు తెచ్చావా అని ప్రశ్నించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే 'అనంత' చొరవతో నగరంలో రూ.వందల కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. అనంతపురానికి 40 రోజుల్లో వచ్చి 40 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న నాయకుడిని ఓడించానని దగ్గుపాటి చెబుతున్నారని, సీఎం చంద్రబాబు నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వరకు ఓటమి పాలైన వారేనన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు అనిల్ కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, నరసింహులు, సాకే చంద్రలేఖ, దుర్గాదేవి, శ్రీనివాసులు, నాయకులు లక్ష్మీన్న, దాదాఖలందర్, రామచంద్ర, సాకే కుళ్లాయస్వామి, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

దేశ రక్షణలో ఆర్మీ పాత్ర కీలకం



కూడేరు: మాట్లాడుతున్న కమాండర్ కల్నల్ ఎంఎస్ కులకర్ణి

కూడేరు: దేశ రక్షణలో ఆర్మీ పాత్ర చాలా కీలకమైందని, దేశం కోసం సరిహద్దుల్లో ప్రాణాలను త్యాగం చేయడానికైనా సిద్ధంగా ఉంటారని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ ఎంఎస్ కులకర్ణి అన్నారు. శనివారం బ్రాహ్మణ పల్లి వద్ద ఎన్‌సీసీ నగర్‌లో ఆరో ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ అనంతపురం ఆధ్వర్యంలో సీఏటీసీ–1 ఎన్‌సీసీ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. 500 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్యాడెట్లనుద్దేశించి క్యాంప్ కమాండర్ ప్రసంగించారు. యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకొని దేశాభివృద్ధి కోసం పాటు పడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ ఎస్.పావని, మేజర్ బల్‌బీర్ సింగ్, జేసీఓలు కైలాస్ బంకర్, రామచంద్ర, ఎన్‌సీసీ అధికారులు నవీన్ కుమార్, ఎం.ఎండీ ముదస్సర్, ఎం.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

దుర్యోధనుడిగా మెప్పించిన డీఆర్వో



బాలికల సాంస్కృతిక ప్రదర్శన



దుర్యోధనుడి వేషధారణలో డీఆర్వో మలోల

అనంతపురం కల్చరల్: విధుల్లో నిత్యం బిజీగా ఉండే డీఆర్వో మలోల దుర్యోధనుడి అవతారమెత్తారు. అద్భుతంగా హావభావాలు పలికించి భళా అనిపించారు. ప్రాచీన కళారూపమైన పౌరాణిక నాటకోత్సవాలు శనివారం రాత్రి స్థానిక కృష్ణకళామందిరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అనంత రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు సాగే పౌరాణిక నాటకోత్సవాల్లో భాగంగా తొలిరోజు 'శ్రీకృష్ణరాయభారం' నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. మధురమైన పద్యాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ముఖ్యంగా డీఆర్వో మలోల దుర్యోధనుడిగా, టీవీఎస్ శర్మ కృష్ణుడిగా, సంజీవరెడ్డి అర్జునుడిగా పోటీపడుతూ నటించి మెప్పించారు. అంతకు ముందు కత్తి విజయ్‌కుమార్ శిష్యబృందం డ్యాన్సులతో ఆడిటోరియాన్ని హోరెత్తించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మరో మూడురోజుల పాటు నాటకాలు సాగుతాయన్నారు. చివరిరోజు అనంత రంగ స్థలానికి విశేష సేవలందించిన కళాకారులకు ఎన్టీఆర్ పురస్కారాలనందిస్తామని తెలిపారు. కళాకారులను ప్రోత్సహించడం ద్వారా ప్రాచీన కళలను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీసీసీ చైర్మన్ కుంటిమడుగు కేశవ రెడ్డి, సామాజిక సేవా కార్యకర్త రవికాంత్‌రమణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, నాటకోత్సవాలు నిర్వాహకులు మైఖేల్ బాబు, రాజగోపాలనాయుడు, త్రిలోక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట భద్రత ఉండాలి

అనంతపురం అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) భద్రపరిచిన గోదాముల వద్ద పటిష్ట భద్రత ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఈవీఎంలను భద్రపరిచిన గోదాములను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. గోదాముల వద్ద సీసీ కెమెరాల నిఘా నిరంతరం ఉండాలన్నారు. వర్షాకాలం ఆరంభమవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎ.మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

రాప్తాడురూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు తీవ్ర మనస్థాపానికి గురై బలవన్మరణం పొందిన ఘటన అనంతపురం రూరల్ మండలం కళ్యాణదుర్గం రోడ్డు పిల్లిగుండ్లకాలనీలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.... రామాంజనేయులు (75)కు ఇటీవల వెన్నెముక ఆపరేషన్ జరిగింది. పూర్తి స్థాయిలో నయం కాకపోవడంతో నొప్పి పెడుతూ వచ్చింది. ఈ నొప్పిని భరించలేక రామాంజనేయులు శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పిల్లిగుండ్లకాలనీలోని సోదరుడి నివాసంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈయన భార్య కర్ణాటక రాష్ట్రం హసన్‌లో నర్సుగా పని చేస్తుంది. ఆమెతో పాటు పిల్లలు అక్కడే ఉంటారు. రామాంజనేయులు ఇక్కడే సోదరుడి నివాసంలో ఉంటాడు. ఆత్మహత్య ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు బ్రాహ్మణ ధర్మోపనయనాలు

అనంతపురం కల్చరల్: సామూహిక బ్రాహ్మణ ధర్మోపనయనాలు ఆదివారం ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు తపోవనంలోని శ్రీవేద మాత గాయత్రిదేవి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు నుంకేసుల సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

విశ్రాంత ధామానికి భూమి పూజ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆవరణలో రోగుల సహాయకుల సౌకర్యార్థం ఎంపీ నిధులు రూ.75 లక్షలతో విశ్రాంతి ధామం నిర్మాణానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శనివారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



లగేజీ వాహనాల్లో కూలీలను తరలిస్తున్న డ్రైవర్లకు జరిమానా విధిస్తున్న పోలీసులు

అనంతపురం: నిబంధనలు పాటించాలని పోలీసులు పేర్కొన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు విజిబుల్ పోలీసింగ్ చేపట్టారు. క్షుణ్ణంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. రోడ్డు భద్రతా ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లగేజీ వాహనాలలో కూలీలను అధిక సంఖ్యలో తీసుకెళ్తే జరిమానా తప్పదని హెచ్చరించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వారిపై, త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, తదితర ఉల్లంఘనలపై చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అందరూ సహకరించాలని.. రోడ్డు భద్రత నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.

'సమాచార హక్కు చట్టం నిర్వీర్యం'

అనంతపురం: సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ వ్యవస్థాపకులు కేపీ రాజు అన్నారు. శనివారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడారు. ఇటీవల వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ల నుంచి సమాచారం కోరగా.. మీరు అడిగిన ప్రశ్నలో స్పష్టత లేదని సీఐలు రాజేంద్రనాథ్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్ సమాచారం పంపి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. వీరికి సమాచార హక్కు చట్టంపై కనీస అవగాహన ఉందా అని ప్రశ్నించారు.

పొగాకుతో అనర్థాలు

అనంతపురం: పొగాకు తీసుకోవడం వల్ల చాలా అనర్థాలు తలెత్తుతాయని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ రీజనల్ మేనేజర్ వి.చంద్రమౌళి అన్నారు. ప్రపంచ పొగాకు నిషేధ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఎస్కేయూ వద్ద ఉన్న రూడ్‌సెట్ సంస్థలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లిక్రాస్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన మేరకు.. కూడేరుకు చెందిన రామాంజనేయులు వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై పామిడికి వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో రామాంజనేయులకు కాలుకు విరిగింది. స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం అతన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.